క్లుప్తంగా

లక్ష్మీనరసింహుడికి పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీక మాసం నాల్గవ శనివారం సందర్భంగా వేకువజాము నుంచే స్వామి వారికి అభిషేక, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని కాయాకర్పూరం సమర్పించుకున్నారు. భక్తుల దర్శనార్థం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కోటి దీపోత్సవం కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నేడు వీరభద్రస్వామి కల్యాణం

అట్లూరు : మండల పరిధిలోని కొండూరు గ్రామంలో వెలసిన వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవార్ల కల్యాణం వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ కొత్తమద్ది కుటుంబ సభ్యులు తెలిపారు. సుమారు 500 ఏళ్ల క్రితం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఈ ఆలయంలో వీరభద్రస్వామిని స్వయంగా ప్రతిష్ఠించినట్లు తెలిపారు. అయితే ఆలయం శిథిలావస్థకు చేరడంతో కడప పట్టణానికి చెందిన కొత్తమద్ది కుటుంబీకులు లక్షల రూపాయలు వెచ్చించి నూతన ఆలయం నిర్మించి అప్పటి నుంచి ప్రతి ఏటా శ్రీస్వామి వారికి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు.

సీబీఐటీలో విద్యార్థులకు వర్క్‌షాప్

చాపాడు : స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)కాలేజీలో శనివారం సివిల్ విద్యార్థులకు స్టీల్ డికెటైలింగ్ రైన్ ఫోర్స్‌మెంట్ డిటైలింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోయంబత్తూరుకు చెందిన ఫోర్ వాల్ కన్‌స్ట్రక్షన్ స్ట్రక్చరల్ ఇంజినీర్ ప్రణప్ హాజరయ్యారు. ఈయన విద్యార్థులకు స్లాబ్ నిర్మించటం, పిల్లర్లు, పుటింగ్‌లు వేయటం వంటి వివిధ రకాలైన విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలు ఇవ్వాలి

ప్రొద్దుటూరు : స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న శానిటరీ కార్మికులకు మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వలేదని, వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం వారు జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ బాబును కలిసి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కళావతి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

కాశినాయన : మండలంలోని అమగంపల్లె విచారణ చర్చి పరిధిలోని 265 మందికి దుస్తులు పంపిణీ చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన 150 మంది వృద్ధులకు, జ్యోతి కాన్వెంట్ సిస్టర్స్ ఆధ్వర్యంలో నడపబడుతున్న టైలరింగ్ సెంటర్ వారికి, టీబీ శానిటోరియం, బాలమ్మ సత్రంలోని వృద్ధులు హాజరయ్యారు. వీరికి ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, చిత్తా థామస్‌రెడ్డిల ఆధ్వర్యంలో క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సంస్థ ప్రతినిధి ఎల్.ప్రసాద్ రెడ్డి శనివారం ఉచితంగా దుస్తులు అందజేశారు. దుస్తులు పంపిణీ చేసినందుకు ఫాదర్ దేవరాజు, సిస్టర్లు థెరిసా, సెరిన్, వృద్ధులు సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీవీరభద్రస్వామి దేవస్థానానికి చెందిన నూతన ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ కె.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి కర్నూలు డివిజన్ ఉప కమిషనర్ కార్యాలయం నుంచి నోటిఫికేషన్ జారీశారని ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల వారు 20 రోజుల్లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

రైతులకు మరిన్ని సేవలు

మైదుకూరు : కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు వికసిత భారత్ సంకల్పయాత్ర దోహదం చేస్తుందని కేంద్రం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. శనివారం కేవీకేలో వికసిత భారత్ సంకల్పయాత్రను పురస్కరించుకుని రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త బాలకృష్ణ మాట్లాడుతూ వికసిత భారత్ సంకల్పయాత్రలో భాగంగా రైతులకు అందిన సేవలను తెలుసుకొని, మరిన్ని కార్యక్రమాలను చేపట్టనున్నారని తెలిపారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు కాంతిశ్రీ, లావణ్య, ఫిరోజ్ హుస్సేన్, రైతు నాయకులు బీపీ ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం సాగించండి

రాజుపాళెం : గ్రామంలో ఎటువంటి సమస్యలు లేకుండా ప్రశాంత జీవనం సాగించాలని ఎస్ఐ రాజగోపాల్ సూచించారు. జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు మండలంలోని కొర్రపాడు గ్రామంలో శనివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఫ్యాక్షన్ వల్ల బాగుపడిన దాఖలాలు లేవని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్బారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' క్రీడాకారులకు సువర్ణావకాశం

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



విద్యార్థి మహమ్మద్ బాషాకు రూ.50వేలు ఇస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

మైదుకూరు : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ప్రతిభ కలిగిన క్రీడాకారులకు సువర్ణ అవకాశమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అదే రీతిలో ఆడుదాం ఆంధ్రాను నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో ఎంతో మంది వివిధ క్రీడల్లో ప్రతిభ ఉన్న వారు ఉన్నారని, అయితే వారికి తగిన గుర్తింపు లేదని తెలిపారు. ఈ సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్రీడాకారుల కోసం చేపట్టిన ఆడుదాం ఆంధ్ర పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ క్రీడల్లో పాల్గొని ప్రతిభకనపరచాలని, ప్రభుత్వం అన్ని విషయాల్లోనూ అండగా ఉండి ప్రోత్సహిస్తుందని తెలిపారు. నాడు–నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మార్చిన సీఎం జగన్ క్రీడలకు అదే విధమైన ప్రోత్సాహం అందించనున్నారని తెలిపారు. ఇప్పటికే ఆడుదాం ఆంధ్రలో పాల్గొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 22 లక్షల మంది క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని చెప్పారు. మొదట సచివాలయ పరిధిలో, మండల స్థాయిలో పోటీలు జరుగుతాయని, నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి రూ.35వేలు, రూ.15వేలు, రూ.5వేలును మొదటి, రెండవ, మూడవ బహుమతుల కింద అందిస్తారన్నారు. రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి రూ.5లక్షలు, రెండో బహుమతి రూ.3 లక్షలు, మూడో బహుమతి రూ.2 లక్షలను అందిస్తారని చెప్పారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, జిల్లా కార్యవర్గ సభ్యుడు కూశెట్టి రాయుడు, కోఆప్షన్ సభ్యుడు ట్రాక్టర్ గౌస్, భరత్ కుమార్ రెడ్డి, బీఎల్ రఘురామయ్య, వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.50వేలు అందజేత

అంతర్జాతీయ జంప్ రోప్ పోటీల్లో పాల్గొననున్న మైదుకూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి మహమ్మద్ బాషాకు శనివారం సాయంత్రం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి రూ.50వేలు అందజేశారు. థాయిలాండ్‌లో ఈనెల 17 నుంచి జరిగే అంతర్జాతీయ అండర్–17 జంప్‌రోప్ పోటీల్లో మైదుకూరుకు చెందిన మహమ్మద్ బాషా పాల్గొననున్నాడు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెడ్మాస్టర్ మణి ప్రకాష్, ఉపాధ్యాయుడు సూర్యనారాయణరెడ్డి, యోగా శిక్షకుడు రమేష్ పాల్గొన్నారు.

రూ.10 లక్షలు ఎల్‌ఓసీ అందజేత

మైదుకూరు మున్సిపాలిటీలోని శెట్టివారిపల్లెకు చెందిన కె.రామాంజులరెడ్డి అనే వ్యక్తికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి రూ.10 లక్షలు ఎల్‌ఓసీ పత్రాన్ని అందించారు. లివర్ వ్యాధితో బాధపడుతున్న రామాంజులరెడ్డికి శస్త్రచికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.10లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు.

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే దాతృత్వం

5 కుటుంబాలకు రూ.2.20 లక్షలు
ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సహాయం అందుకున్న వారితో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గంలో పేద కుటుంబాల సంక్షేమమే తన లక్ష్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఐదు పేద కుటుంబాలకు రూ.2.20 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించి ఆయన మరో సారి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ టీడీపీ నాయకులు తన వ్యక్తిగత సంపాదనపై చేసిన విమర్శలపై ఘాటుగా స్పందించారు. తన సంపాదనకు వారసులైనా, బినామీలైనా ప్రజలేనన్నారు. ప్రతి నిత్యం తాను చేతనైన సహాయం అందిస్తున్నానన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టానని, ప్రతిపక్ష నాయకులు ఏ నాడైనా పేదల కష్టాల్లో పాలుపంచుకున్నారా అని ప్రశ్నించారు. పేదరికాన్ని తాను అనుభవించానని, ఆ కష్టాలు, బాధలు తనకు తెలుసన్నారు. ఈశ్వరుని అనుగ్రహం ఉన్నంత వరకు పేదలకు సేవ చేస్తూనే ఉంటానన్నారు.

- పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన అజిజున్ కుమారుడు 12 ఏళ్ల బాలుడు తౌసిఫ్‌కు పుట్టుకతోనే షుగర్ వ్యాధి సోకిందని, రోజూ ఇన్సులిన్‌తోనే వ్యాధిని అదుపు చేసుకుంటున్నాడన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆ బాలుడికి రూ.లక్ష ఆర్థిక సహాయం అందించానని, ప్రస్తుతం రూ.50 వేలు ఇచ్చానని, మరో మారు రూ.50 వేలు ఇస్తానని తెలిపారు.
- సంజీవనగర్‌కు చెందిన సురేఖ భర్త ఓ కేసులో జైలుకు వెళ్లడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉందన్నారు. కుటుంబాన్ని పోషించుకునేందుకు సురేఖకు రూ.50వేలు నగదు ఇచ్చానని, భవిష్యత్తులో ఆమెకు ఉద్యోగం కూడా ఇప్పిస్తానని చెప్పారు.
- అమృతానగర్‌కు చెందిన ఇస్మాయిల్ ప్రమాదం కారణంగా వైద్యం చేయించుకుని అప్పులపాలయ్యాడన్నారు. ఆయన కుమార్తె వలంటీర్‌గా పనిచేస్తున్నారని, రూ.50వేలు ఇచ్చానన్నారు.
- 22వ వార్డుకు చెందిన షేక్ అయేషాకు అనారోగ్య కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో రూ.50వేలు ఇచ్చానన్నారు. 24వ వార్డుకు చెందిన మాబుహుసేన్‌కు ఫిజియో థెరపి కోసం రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించానని తెలిపారు.
- కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఘనంగా బిందెసేవ మహోత్సవం



బిందెసేవలో కలశాలను ఊరేగిస్తున్న రామేశ్వరం పద్మశాలీయ బహూత్తమ సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీ భద్రావతి భావన్నారాయణ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం భద్రవతి భావన్నారాయణ స్వామివారికి విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మూలమంత్రహోమం, జపపారాయణ తదితర పూజాకార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగాయి. హనుమత్ లింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి, అమ్మవారిని కలశాలలోకి ఆవాహన చేసి బిందె సేవ మహోత్సవం చేపట్టారు. పురవీధుల్లో మంగళవాయిద్యాల మధ్య ఘనంగా ఊరేగించారు. కాగా ఆదివారం ఉదయం 11.45 గంటలకు భద్రావతి భావన్నారాయణ స్వామి కళ్యాణోత్సవం, అన్నప్రసాద వినియోగం, రాత్రి 8 గంటలకు గ్రామోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలీయ బహూత్తమ సంఘం అధ్యక్షుడు మేరువ పెంచలయ్య, ప్రధాన కార్యదర్శి సోము జానకిరామయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు నందం లక్ష్మణకుమార్, కోశాధికారి గునిశెట్టి సురేష్ బాబు, నందం రామయ్య, నరసింహామూర్తి, ప్రసాద్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సలహాలు పాటించాలి

ప్రొద్దుటూరు క్రైం : గర్భిణీలు వైద్యుల సలహాలు పాటించాలని డాక్టర్ వల్లంకొండు అనూష తెలిపారు. ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైఎంఆర్‌కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో శనివారం గర్భిణీలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష, డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ ప్రతి నెలా 9వ తేదీన పీఎంఎస్ఎంఏ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. క్రమం తప్పకుండా పిల్లలకు టీకాలు వేయించాలని తెలిపారు.

కామనూరు పీహెచ్‌సీలో..

మండలంలోని కామనూరు పీహెచ్‌సీలో 27 మంది గర్భిణీలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ హనీఫ్‌బాబా వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ తేజ, సీహెచ్‌ఓ కృష్ణమ్మ పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న స.హ.చట్టం రక్షణ వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు గురుమూర్తి

బద్వేలు అర్బన్ : అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కలసికట్టుగా కృషి చేయాలని వైవీయూ పాలక మండలి సభ్యులు కొండపల్లి చిన్నసుబ్బారావు పేర్కొన్నారు. అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక జెడ్పీహెచ్ఎస్ (బాయ్స్)లో సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు బి.గురుమూర్తి అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అవినీతి అనేది ప్రపంచ వ్యాప్తంగా సామాజిక, ఆర్థికాభివృద్ధికి హాని కలిగించేదని, దీనిని ప్రతి ఒక్కరు నిర్మూలించేందుకు ముందుకు రావాలని కోరారు. అవినీతి నిర్మూలనకు చట్టాలను మరింత కఠినతరం చేయాలని కోరారు. సదస్సులో బీసీ చైతన్య సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బి.సి.రమణ, సీపీఐ రాష్ట్ర నాయకులు వెంకటసుబ్బయ్య, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సి.నారాయణ, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమణయాదవ్, ఆవాజ్ పట్టణ అధ్యక్షుడు సత్తార్, అంబేడ్కర్ భవన అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జకరయ్య, కేశవయ్య, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మహబూబ్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు సిద్ధం కావాలని ఎస్టీయూ పిలుపు



మాట్లాడుతున్న ఎస్టీయూ మాజీ కార్యదర్శి రఘునాథరెడ్డి

బ్రహ్మంగారిమఠం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న విధానాలకు నిరసనగా ఎస్టీయూ రాష్ట్ర పిలుపుమేరకు ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని ఎస్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం మండకేంద్రమైన బి.మఠంలో బలిజ సంఘం అన్నదాన సత్రంలో రాష్ట్రస్థాయి ఎస్టీయూ శిక్షణా తరగతుల మొదటి రోజున ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల కాలంలో పోరాడి సాధించుకున్న పలు ప్రయోజనాలకు ఈ ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయన్నారు. ఉపాధ్యాయులకు ఎలాంటి ఉపయోగం లేని పథకాలు అమలు పరుస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఉపాధ్యాయులపై కక్షసాధింపు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి, రాష్ట్ర నాయకులు బాలగంగిరెడ్డి, బాలరాజు, జిల్లా ప్రధాన ఆర్థిక కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, మహబూబ్‌బాషా, నాయకులు రామచంద్రరావు, ప్రకాష్‌రావు, రవికేశవరావు, చంద్రహాసన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, వాకా చంద్రశేఖర్‌రెడ్డి, శేఖర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు టీటీడీ భగవద్గీత కంఠస్థ పోటీలు

పోరుమామిళ్ల : టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం (నేడు) భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ధర్మ ప్రచార మండలి సభ్యులు తుపాకుల శ్రీనివాసులు తెలిపారు. ఆరు, ఏడు తరగతులు జూనియర్ విభాగం, 8, 9 తరగతులు సీనియర్ విభాగం గాను పోటీలు జరుగుతాయన్నారు. 3వ అధ్యాయం కర్మయోగంలో 30 శ్లోకాలపై పోటీలు ఉంటుందన్నారు. అలాగే 18 సంవత్సరాలలోపు జూనియర్ విభాగంగా, ఆపై వారు సీనియర్ విభాగంగా సంపూర్ణ భగవద్గీతపై పోటీలు జరుగుతాయన్నారు. అన్ని విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పోటీలు కడప రాజంపేట హైవే, విద్యాధరపురం, శ్రీ లలితా దేవాలయంలో పోటీలు జరుగుతాయన్నారు. వివరాలకు 9492805446 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం



బద్వేలు అర్బన్: ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వేషధారణ

బద్వేలు అర్బన్ : పట్టణంలో అయ్యప్ప స్వామి గ్రామోత్సవం శనివారం వైభవంగా జరిగింది. తెలుగు గంగ కాలనీ సమీపంలో ఉన్న దత్తసాయిబాబా ఆలయ ప్రాంగణంలో వెలసిన అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత అయ్యప్పస్వామి ఉత్సవమూర్తికి పూజలు నిర్వహించి అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామివారిని కొలువు దీర్చి గ్రామోత్సవం జరిపారు. దేవతామూర్తుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో అయ్యప్పస్వామి ఆలయ గౌరవాధ్యక్షులు భూమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సలహాదారులు బి.వీరనారాయణరెడ్డి, టి.వెంకటసుబ్బయ్య, కె.రామసుబ్బారెడ్డి, ఎస్.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం

బ్రహ్మంగారిమఠం : బి.మఠం అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మఠం పురవీధులలో గ్రామోత్సవాన్ని మేలతాలు, డప్పు వాయిద్యాలతో వేడుకగా నిర్వహించారు. మండలంలో అయ్యప్ప మాలధార భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం, ప్రసాదం అందజేశారు.

రాజీ మార్గమే ఉత్తమం



బద్వేలు అర్బన్ : కక్షిదారులకు అవార్డు ఫారం అందజేస్తున్న న్యాయమూర్తులు

బద్వేలు అర్బన్ : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను కక్షిదారులు రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం ఉత్తమమని ఇందుకు లోక్ అదాలత్ సహకరిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి, మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ వై.జె.పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రిలు పేర్కొన్నారు. శనివారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో వారు మాట్లాడారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోకుండా కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. లోక్ అదాలత్ సందర్భంగా రెండు బెంచీలను ఏర్పాటు చేసి 116 క్రిమినల్ కేసులు, 20 సివిల్ కేసులను పరిష్కరించి రూ.86,41,764లు కక్షిదారులకు చెల్లించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.వి.ఎస్.ప్రసాద్, సీనియర్ న్యాయవాదులు డి.బ్రహ్మారెడ్డి, చంద్రఓబుల్‌రెడ్డి, డి.వి.ఎ స్.ఆర్.క్రిష్ణ, రాజేశ్వర్‌రెడ్డి, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్‌లు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం



నరహరిపురంలో పశువులకు వైద్యం చేస్తున్న పశు వైద్యాధికారి విజయకుమార్

చాపాడు : మండలంలోని నరహరిపురం గ్రామంలో శనివారం రిలయన్స్ ఫౌండేషన్, పశు సంవర్ధకశాఖ సంయుక్తంగా ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పశువుల్లో ఏడాదికి ఒక దూడ ప్రసవం అయ్యేలా చూసుకోవటం పాడి రైతులకు లాభదాయకమని వెదురూరు పశు వైద్యాధికారి విజయకుమార్ అన్నారు. దీనికి తగిన పోషణ, యాజమాన్య మెలకువలను రైతులకు వివరించారు. సంవత్సరానికి కనీసం రెండు సార్లు పశువులకు నట్టల నివారణ మందులు తాపించాలన్నారు. అనంతరం పశు వైద్య శిబిరంలో 200 జీవాలను నట్టల నివారణ మందులు, 25 పశువులకు సాధారణ చికిత్సలు, 20 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి అమీర్, పశు సంవర్ధకశాఖ సిబ్బంది లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక మహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని దొరసానిపల్లెలో వెలసిన సీతారామాంజనేయస్వామి ఆలయంలో కార్తీకమహోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. రాత్రి చెక్కభజన, కర్రసాముల మధ్య గౌరమ్మ–గొంతెమ్మలకు ఊరేగింపు నిర్వహించారు. అలాగే సీతారామాంజనేయస్వామి రథోత్సవాన్ని వైభవంగా జరిపారు.

వై ఏపీ నీడ్స్ జగన్



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పోరుమామిళ్ల : ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేశారని, ప్రజల్లో నమ్మకాన్ని నిలబెట్టుకున్నారని ఉప సర్పంచ్ రాళ్లపల్లె రవికుమార్ చెప్పారు. శనివారం పోరుమామిళ్ల సచివాలయం – 2 పరిధిలో వలంటీర్లు, గృహసారథులతో కలసి ఇంటింటి ప్రచారం చేశారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఎన్ని? వాటిలో ఎన్ని హామీలు నెరవేర్చారు? 2019లో వైఎస్ జగన్ ఎన్ని హామీలు ఇచ్చారు? ఎన్ని నెరవేర్చారు? అనే అంశాలతో ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ అందజేశారు. ప్రతి ఇంటికి సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో అందిన లబ్ధిని వివరించారు. ఇదే పద్ధతిలో పథకాలు అమలు కావాలంటే మళ్లీ జగనే సీఎం కావాలని, అందుకు మీరందరూ ఆశీర్వదించాలని ఉప సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ మెంబర్ అల్లా, మాజీ ఉప సర్పంచ్ రాళ్లపల్లె నరసింహులు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు శ్రేయస్కరం



వైద్య శిబిరానికి హాజరైన గర్భిణులు

చాపాడు : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయించుకోవటం శ్రేయస్కరమని వైద్యాధికారి శ్రీవాణి పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం పీఎంఎస్ఎంఏ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీవాణి మాట్లాడుతూ.. గర్భిణులు క్రమం తప్పకుండా పోషక విలువతో కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. రక్తహీనతకు గురి కాకుండా ఆకుకూరలు, కాయగూరలు తీసుకోవాలని సూచించారు. వైద్య పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన వారికి మండలంలోని అల్లాడుపల్లెకు చెందిన వ్యాపారి నారాయణ యాదవ్ భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఓబులేసు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన అశోక్‌కుమార్‌తో ఎన్జీఓ నాయకులు, రెవెన్యూ సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు తాలుకా ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా రాజుపాలెం మండలంలో వీఆర్ఓగా పని చేస్తున్న అశోక్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. శనివారం సాయంత్రం ఎన్జీఓ కార్యాలయంలో అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల అధికారిగా నిత్యపూజయ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు డి. రవికుమార్, బి. శ్రీనివాసులు, రామసుబ్బయ్య, సదాశివ, ప్రమీల, జయంతికుమారి, మాధు, నాగరాజు, శివరామానుజం, సంధ్యారాణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కలసపాడుకు అయోధ్య రామయ్య అక్షింతలు

కాశినాయన (కలసపాడు) : మండలానికి ఆదివారం సాయంత్రం 3 గంటలకు అయోధ్య రామమందిరం పూర్తి చేసుకుని రాములవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని అయోధ్య నుంచి పంపిన అక్షింతలు కలసపాడుకు చేరనున్నట్లు కలసపాడు మండల ప్రధాన అర్చకులు వారణాసి రమణయ్య తెలిపారు. మండల ప్రజలు ఈ శోభా యాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.